సాక్షి
రాజన్న సిరిసిల్ల
గురువారం । 14 । నవంబర్ । 2024



యాజమాన్య పద్ధతులు పాటించాలి

బోయినపల్లి(చొప్పదండి): రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏరువాక శాస్త్రవేత్తలు ఎం.రాజేంద్రప్రసాద్, మదన్‌మోహన్‌రెడ్డి, కో–ఆర్డినేటర్ విజయభాస్కర్ పేర్కొన్నారు.



రాజన్నను దర్శించుకున్న పీఠాధిపతి

వేములవాడఅర్బన్: రాజన్నను తొగుట పీఠాధిపతి శ్రీమాధవానందస్వామి దర్శించుకున్నారు. ఈవో వినోద్‌రెడ్డి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

గరిష్ఠం/కనిష్ఠం
32.0/22.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

ప్రత్యామ్నాయమే ఆదుకుంది!

- పెద్దపల్లి–నిజామాబాద్ రూట్లో 16 రైళ్ల మళ్లింపు
- నాటి ప్రధాని పీవీ ముందుచూపు ఫలితం
- చొప్పదండి, జగిత్యాల మార్గంలో రోజంతా గేటు కష్టాలు
- రాఘవాపూర్ ఘటనతో ఆర్టీసీ ప్రత్యేక బస్సులు
- బోసిపోయిన రామగుండం, పెద్దపల్లి, జమ్మికుంట స్టేషన్లు



రాఘవాపూర్ సమీపంలో బుధవారం రాత్రి కొనసాగుతున్న ట్రాక్ పునరుద్ధరణ పనులు



బోసిపోయిన జమ్మికుంట రైల్వేస్టేషన్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: పెద్దపల్లి జిల్లా రాఘవాపూర్ వద్ద మంగళవారం రాత్రి గూడ్స్ రైలు పట్టాలు తప్పడంతో పెద్దపల్లి–నిజామాబాద్ రైల్వేలైన్ ప్రాధాన్యం మరోసారి చర్చకు వచ్చింది. వాస్తవానికి ఈ మార్గాన్ని గూడ్స్ బండ్లు నడిపేందుకు మాత్రమే ఎక్కువ వినియోగిస్తున్నారు. వాణిజ్యపరంగా లాభసాటిగా ఉన్నా ఆశించిన మేర ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడపడం లేదు. కానీ, గూడ్స్ రైలు ప్రమాదంతో ఈ రూట్ ప్రాధాన్యం ఏంటో దక్షిణ మధ్య రైల్వే అధికారులకు మరోసారి తెలిసి వచ్చింది. ఢిల్లీ, మహారాష్ట్ర వెళ్లాల్సిన 16 నుంచి 20 రైళ్లను బుధవారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల, నిజామాబాద్ మీదుగా మళ్లించారు. దీంతో నిత్యం ప్రయాణికులతో కిటకిటలాడే రామగుండం, పెద్దపల్లి, జమ్మికుంట రైల్వేస్టేషన్లు బోసిపోయాయి.

రైలుగేట్లు పడటంతో ఇబ్బందులు

కరీంనగర్ రైల్వేస్టేషన్ వద్ద చొప్పదండి మీదుగా మంచిర్యాల వైపు వెళ్లే ప్రయాణికులు బుధవారం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాఘవాపూర్ వద్ద మరమ్మతుల నేపథ్యంలో ఢిల్లీ వైపు వెళ్లే రైళ్లను కరీంనగర్ మీదుగా మళ్లించడంతో కరీంనగర్, ఆరెపల్లి, గంగాధర ప్రాంతాల్లో పలుమార్లు రైలు గేట్లు వేయాల్సి వచ్చింది. దీంతో చొప్పదండి మీదుగా కరీంనగర్‌కు వచ్చే అంబులెన్సులు, అందులోని రోగులు, వాహనాదారులు, కరీంనగర్ నుంచి ఎస్‌హెచ్–563 మీదుగా జగిత్యాల, నిజామాబాద్ వైపు వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కరీంనగర్‌లో నిర్మిస్తున్న ఆర్వోబీ పనులు నత్తనడకన సాగుతుండటంతో వీరి కష్టాలను మరింత పెంచుతోంది.

1993లో పెద్దపల్లిలో శంకుస్థాపన

1993లో నాటి ప్రధాని పీవీ నరసింహారావు ముందుచూపు వల్ల పెద్దపల్లి–నిజామాబాద్ మార్గం మనుగడలోకి వచ్చింది. ఆ ఏడాది జూన్ 30న పెద్దపల్లిలో ఈ రూట్‌కు(178 కిలోమీటర్లు) శంకుస్థాపన చేశారు. అయితే, నిధుల కేటాయింపులో పెద్దగా ప్రాధాన్యం దక్కకపోవడంతో పూర్తవడానికి (2017లో విద్యుదీకరణ) 24 ఏళ్లు పట్టింది. అయినా, నేటికీ ఇది సింగిల్ లైన్‌గానే కొనసాగుతోంది తప్ప డబ్లింగ్‌కు నోచుకోవడం లేదు. అదే సమయంలో కొత్తపల్లి–మనోహరాబాద్(151 కి.మీ.) మార్గం రెండేళ్లలో పూర్తవనుంది. అలాగే, ఆర్మూర్–ఆదిలాబాద్ (121 కి.మీ.) లైన్ పూర్తయితే.. భవిష్యత్తులో కరీంనగర్ ఈ ప్రాంతానికి రైల్వే కేంద్రంగా మారనుంది. ప్రస్తుతం కాచిగూడ, తిరుపతి, దాదర్‌ముంబై తదితర కొన్ని రైళ్లు మాత్రమే ఉమ్మడి జిల్లా ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. ఈ మార్గాన్ని డబ్లింగ్ చేసి, రెగ్యులర్ రైళ్లు నడిపితే ఉత్తర తెలంగాణ రవాణాలో సరికొత్త అధ్యాయం లిఖిస్తుందని ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు.

ఆర్టీసీ ఏర్పాట్లు..



కిక్కిరిసిన పెద్దపల్లి ఆర్టీసీ బస్టాండు

రాఘవాపూర్ వద్ద రైలు పట్టాలు తప్పడంతో రైల్వే అధికారులు అప్రమత్తమయ్యారు. వెంటనే కరీంనగర్ ఆర్టీసీ అధికారులను సంప్రదించారు. కాగజ్‌నగర్, బెల్లంపల్లి, మంచిర్యాలలో దిగాల్సిన ప్రయాణికుల కోసం అర్ధరాత్రి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు వేసి, గమ్యస్థానాలకు చేర్చారు. అదే సమయంలో కాజీపేట–బల్లార్షా మీదుగా నడిచే 39 రైళ్లను పూర్తిగా, 7 రైళ్లను పాక్షికంగా రద్దు చేశారు. 61 రైళ్లను దారి మళ్లించారు. మరో ఏడింటిని రీషెడ్యూల్ చేయడంతో దూరప్రాంత ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. చెన్నై నుంచి అహ్మదాబాద్ నవజీవన్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, చెన్నై నుంచి గయా వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, చెన్నై నుంచి లక్నో బై వీక్లీ ఎక్స్‌ప్రెస్, మధురై నుంచి ఢిల్లీ నిజాముద్దీన్ తమిళనాడు సంపర్క్ క్రాంతి, ఎస్ఎంవీటీ బెంగళూరు నుంచి దానాపూర్ పాట్నా సంఘమిత్ర సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, బిలాస్‌పూర్ నుంచి తిరునల్వేలి వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ తదితర రైళ్లను పెద్దపల్లి–నిజామాబాద్ మార్గంలో మళ్లించారు. దీంతో ఆదిలాబాద్, కరీంనగర్, హైదరాబాద్ మధ్య రాకపోకలు సాగించే ప్రయాణికులు ఆర్టీసీ బస్సులను ఆశ్రయించడంతో ఆయా రూట్లలో రద్దీ పెరిగింది.

నేటి బాలలే రేపటి పౌరులు, రేపటి జాతి సంపదలు.. విరిసివిరియని కుసుమాలు సరైన విద్యతో మాత్రమే మెరుగైన సమాజాన్ని నిర్మించవచ్చు. సుసంపన్నమైన దేశం కోసం .. సిద్ధమవుతున్న నేటి ఆణిముత్యాలే రేపటి మన జాతి రత్నాలు. తల్లిదండ్రుల కలల ప్రతిరూపాలు.. భావి భారత పౌరులు. వారికి విద్యతో పాటు మంచి విలువలను నేర్పుదాం. పాలబుగ్గల నవ్వులు, అపురూపమైన క్షణాలు.. మరపురాని జ్ఞాపకాలు.. బాల్యం ఒక వరం. పిల్లలు భగవంతుని స్వరూపాలు.. కల్లాకపటం ఎరుగని కరుణామయులు.. రివ్వున ఎగిరే గువ్వలు..



బాలల నేస్తం.. చాచా నెహ్రూ..

నవంబర్ 14 వచ్చింది.. బాలలకు బోలెడు సందడి తెచ్చింది. ఈ రోజంటే పిల్లలకు పండగ లాంటిది. బాలల దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా వేడుకలా జరుపుకొంటారు. నెహ్రూకు పిల్లలన్నా, గులాబీలన్నా అమితమైన ప్రేమ. పిల్లలకు కూడా పండిట్ నెహ్రూ అంటే వల్లమాలిన ప్రేమ. ఆయన్ని ముద్దుగా 'చాచా నెహ్రూ', 'చాచాజీ' అని పిలుచుకుంటారు. అందుకే 1889 నవంబర్ 14న నెహ్రూ పుట్టిన రోజును బాలల దినోత్సవం జరుపుకుంటారు. ఆయన బర్త్‌డేను 'చిల్డ్రన్స్ డే' నిర్వహించడం ఆనవాయితీ. ఈ రోజున పాఠశాలల్లో పండగ వాతావరణం ఉంటుంది. పిల్లలకు ఇష్టమైన చాక్లెట్లు, ఇతర కానుకలను పంచిపెడతారు. సాంస్కృతిక కార్యక్రమాలతో పిల్లల్లో ఉత్సాహం నింపుతారు.



చిన్నారులకు అక్షరాలు దిద్దిస్తున్న కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి



విద్యార్థినితో పాఠాలు చదివిస్తున్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

కరీంనగర్ అర్బన్/సిరిసిల్ల టౌన్:

నేటి బాలలే రేపటి పౌరులు.. చిన్నతనంలో వారికి పౌష్టికాహారం అందితేనే ఆరోగ్యంగా ఉంటారు.. నాణ్యమైన విద్యనందిస్తే ఉత్తమ పౌరులుగా ఎదుగుతారు.. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి.. నార్మల్ డెలివరీ అయితే భవిష్యత్‌లో ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తవు.. విద్యార్థినులకు రక్షణ ఉండాలి.. పాఠశాలల్లో సమస్యలను పరిష్కరించాలి.. ఇవన్నీ గుర్తెరిగిన కరీంనగర్, రాజన్నసిరిసిల్ల కలెక్టర్లు పమేలా సత్పతి, సందీప్‌కుమార్ ఝా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఒకరు శుక్రవారం సభ పేరిట అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేస్తూ వాటి ద్వారా గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం అందేలా చూస్తుంటే.. మరొకరు పాఠశాలలు, కళాశాలల్లో గర్ల్ చైల్డ్ ఎంపవర్‌మెంట్ క్లబ్‌లు ఏర్పాటు చేయిస్తున్నారు.

కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం, విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడం వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. జిల్లాలో శుక్రవారం సభ పేరిట అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్నారు. ఏఎన్‌ఎంల ద్వారా గర్భిణులకు వైద్య సేవలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ల ద్వారా చిన్నారుల ఎత్తు, వయసుపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారు. గర్భిణులకు నార్మల్ డెలివరీ అయ్యేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు. ఇక, తన పుట్టిన రోజుతోపాటు వివిధ సందర్భాల్లో కలిసేవారు పుష్పగుచ్ఛాలు కాకుండా పెన్నులు, పుస్తకాలు, నోట్‌బుక్కులు తీసుకురావాలని సూచించగా కుప్పలు తెప్పలుగా వచ్చాయి. వాటిని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందజేశారు. అలాగే, విద్యార్థులకు స్ఫూర్తినిచ్చే సినిమాలు చూపిస్తూ వాటిపై సమీక్షలు రాయిస్తున్నారు. హాస్టళ్లలో విద్యార్థుల సమస్యలపై ఆరా తీస్తూ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. సైన్స్ మ్యూజియాన్ని తెరిపించి, సైన్స్ చర్చలు, సదస్సులు, ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. పదోతరగతిలో వెనకబడిన విద్యార్థులను గుర్తించి, ప్రత్యేక తరగతులు నిర్వహించేలా చూస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి బాలల విద్యాభ్యాసంపై కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలలను సందర్శిస్తూ టీచర్ల పనితీరును పరిశీలిస్తున్నారు. ఆయనే స్వయంగా పాఠాలు బోధిస్తూ.. విద్యార్థుల్లో ఆసక్తిని పెంచుతున్నారు. గురుతర బాధ్యతలు విస్మరించే ఉపాధ్యాయులకు సింహస్వప్నంగా ఉంటున్నారు. స్కూళ్లను సందర్శించిన సమయంలో ఆయన దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నారు. పాఠశాలలు, కళాశాలల్లో ఆడపిల్లల రక్షణకు, వారి సమస్యల పరిష్కారం కోసం గర్ల్ చైల్డ్ ఎంపవర్‌మెంట్ క్లబ్‌లు ఏర్పాటు చేయిస్తున్నారు. విద్యా ప్రమాణాల వృద్ధిపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

సిరిసిల్లకల్చరల్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను గురువారం నుంచి నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు నాగుల సత్యనారాయణ బుధవారం ప్రకటనలో తెలిపారు. 57వ గ్రంథాలయ వారోత్సవాల నేపథ్యంలో విద్యార్థులకు పలు రకాల ప్రతిభాపాటవ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయ భవనంలో గురువారం ఉదయం 11.30 గంటలకు పాఠశాల విద్యార్థులకు 'పచ్చదనం పరిశుభ్రత' అంశంపై చిత్రలేఖన పోటీలు, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయాల ఆవశ్యకతపై వ్యాసరచన పోటీలు, 17న మీకు నచ్చిన శాస్త్రవేత్తపై ఉపన్యాసం, 18న దేశభక్తి గీతాల పోటీలు, 19న మెహందీ, ముగ్గుల పోటీలు నిర్వహిస్తామని, 20న ముగింపు వేడుకల్లో ఆయా పోటీల్లోని విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు వివరించారు.

పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఆర్డీవో రాజేశ్వర్

వేములవాడఅర్బన్: పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆర్డీవో రాజేశ్వర్ కోరారు. వేములవాడ నియోజకవర్గంలోని వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులతో బుధవారం సమావేశమయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికల పట్టభద్రుల, టీచర్స్ ఓటరు నమోదు కొనసాగుతుందని తెలిపారు. తహసీల్దార్ మహేశ్‌కుమార్, నాయకులు నిత్యానందరావు, మైలారం రాము, హన్మండ్లు, రామస్వామి పాల్గొన్నారు.

రాజన్న ఆలయ మరో ఉద్యోగికి డిప్యూటేషన్

వేములవాడఅర్బన్: రాజన్న ఆలయంలో విధులు నిర్వహిస్తున్న ఏఈవో రమేశ్‌బాబుకు యాదగిరిగుట్ట ఆలయానికి డిప్యూటేషన్ వేస్తూ దేవాదాయశాఖ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రవ్యాప్త బదిలీల్లో భాగంగా యాదగిరిగుట్ట నుంచి వేములవాడ రాజన్న ఆలయానికి బదిలీ అయిన పర్యవేక్షకులు రాజన్‌బాబు, శ్రీలతలు ఇప్పటికే తిరిగి యాదగిరిగుట్టకు డిప్యూటేషన్‌పై వెళ్లారు. తాజాగా మరో ఏఈవో రమేశ్‌బాబు కూడా డిప్యూటేషన్‌పై వెళ్లనున్నారు.

నేతన్నలు ఆత్మస్థైర్యంతో ఉండాలి

- శాశ్వత ఉపాధి కల్పిస్తాం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- నేతన్న కుటుంబానికి పరామర్శ



నేతన్న కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: నేతకార్మికులు ఆత్మస్థైర్యంతో ఉండాలని, ఆత్మహత్యలకు పాల్పడొద్దని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కోరారు. ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడిన నేతకార్మికుడు ఎర్రం కొమురయ్య కుటుంబాన్ని బుధవారం రాత్రి పరామర్శించారు. కార్మికులకు ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. రానున్న రోజుల్లో సిరిసిల్ల వస్త్రపరిశ్రమకు ప్రభుత్వం మంచి రోజులు తీసుకొస్తుందని తెలిపారు. రూ.50కోట్లతో నూలుడిపోను ప్రారంభిస్తామని, చేనేత, మ్యాక్స్ సంఘాలకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించేలా కృషి చేస్తామన్నారు. వర్కర్ టు ఓనర్ పథకం ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి సాయం

ఆత్మహత్యకు పాల్పడిన ఎర్రం కొమురయ్య కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ.2లక్షలు తక్షణసాయాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అందజేశారు. కుటుంబ పరిస్థితిపై ఆరా తీసి వారిని ఓదార్చారు. మృతుడి భార్య దివ్యాంగురాలని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దృష్టికి తీసుకెళ్లి తక్షణసాయం అందించనున్నట్లు తెలిపారు. సిరిసిల్ల తహసీల్దార్ ఉమారాణి, టెక్స్‌టైల్ ఏడీ సాగర్, టీపీసీసీ కోఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, ఎల్లప్ప ఉన్నారు.

యాంటి బయోటిక్స్ వాడొద్దు





సాక్షి ఫోన్‌ఇన్‌లో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వసంతరావు, హాజరైన వైద్యాధికారులు

- సీజనల్ వ్యాధులపై 24 గంటలు అప్రమత్తం
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిరంతర వైద్యం
- అన్ని రకాల రోగనిర్ధారణ పరీక్షలు ఉచితం
- ప్రైవేటు ఆస్పత్రులపై నిత్యం పర్యవేక్షణ
- 'సాక్షి'తో ఫోన్‌ఇన్‌లో జిల్లా వైద్యాధికారి వసంతరావు

సిరిసిల్లటౌన్: అర్హత లేని వైద్యుల వద్ద చూపించుకొని యాంటీ బయోటిక్స్ వాడొద్దని జిల్లా వైద్యాధికారి వసంతరావు సూచించారు. సీజనల్ వ్యాధులు విజృంభిస్తుండడంతో ప్రజలు జ్వరాలు, దగ్గు, జలుబు, ఒంటినొప్పులతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో 'సాక్షి' ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఫోన్‌ఇన్‌లో ప్రజలు అడిగిన సందేహాలను నివృత్తి చేయడంతోపాటు జ్వరాలు వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. సాధారణ జ్వరాలను సైతం కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు డెంగీ అని భయాందోళనకు గురిచేస్తున్నారని ఆందోళన చెందొద్దన్నారు. జిల్లా వైద్యశాఖ 24 గంటలపాటు అందుబాటులో ఉంటుందని, అత్యవసర చికిత్సకు జిల్లా జనరల్ ఆస్పత్రిలో కార్పొరేట్ స్థాయిలో వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు అడిగిన ప్రశ్నలకు డీఎంహెచ్‌వోతోపాటు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రామకృష్ణ, ఏవో చేపూరి శ్రీనివాస్, హెచ్ఈ ఎం.లింగం, ఎపిడమాలజిస్టు సోనిమణి, సీహెచ్‌వో బాలచందర్‌లు సైతం సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న: సీజనల్ వ్యాధులపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?
– రామంచ బాబు–బూర్గుపల్లి, రమేశ్– బోయినపల్లి

సమాధానం : సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. బయట తిరిగే సమయంలో మాస్కులు ధరించాలి. యాంటిబయోటిక్స్ అధికంగా వాడొద్దు. అర్హత గల వైద్యుడి సలహా మేరకు మందులు వాడాలి.

ప్రశ్న: ప్రైవేట్ ల్యాబుల్లో ఒక వ్యక్తికి ఒకే రకమైన వ్యాధి నిర్ధారణ పరీక్షకు రిపోర్టులు వేర్వేరుగా వస్తున్నాయి. నేరెళ్ల పీహెచ్‌సీలో స్టాఫ్ ఉండడం లేదు. గ్రామాల్లో శానిటేషన్ సరిగ్గా లేదు. వీటిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?
– నవీన్‌కుమార్–నర్సింహులపల్లె, దాసరి విశ్వనాథం–ఆవునూరు

సమాధానం: అన్ని ప్రైవేటు పాథలాజికల్ ల్యాబులు, స్కానింగ్ సెంటర్లపై నిఘా ఉంచాం. పరీక్షల్లో వేర్వేరు ఫలితాలు రావడంపై విచారణ చేపడతాం. అన్ని పల్లెల్లో శానిటేషన్ చర్యలకు జిల్లా పంచాయతీ ఆఫీసర్ దృష్టికి తీసుకెళ్తాం. నేరెళ్ల పీహెచ్‌సీని విజిట్ చేసి చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: ప్రైవేటులో డెంగీ పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తుండ్రు? మీరు ఎలాంటి చర్యలు తీసుకుంటారు? డెంగీ నిర్ధారణ ఎలా చేస్తారు? ప్లేట్‌లెట్స్ ఎందుకు తగ్గుతాయి? అనవసరంగా సర్జరీలు చేస్తున్నారు?
– మారవేని రంజిత్‌కుమార్–రాచర్ల బొప్పాపూర్

సమాధానం: దోమల వ్యాప్తితో డెంగీ జ్వరాలు వస్తాయి. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. పల్లెల్లో సైతం పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. దోమలు కుట్టకుండా కాయిల్స్, తెరలు వాడాలి. ప్లేట్‌లెట్స్ తగ్గితే డెంగీ అనడం సరికాదు. డెంగీకి ఎలీసా టెస్టును జిల్లా ఆస్పత్రి, టీ–హబ్‌లో ఉచితంగా చేసి నిర్ధారిస్తారు. అధికచార్జీల వసూళ్లపై మాకు ఫిర్యాదులు వస్తున్నాయి. కఠినమైన చర్యలు తీసుకుంటాం. పీవోఎంసీహెచ్‌తో అన్ని ఆస్పత్రులు విజిట్ చేయిస్తాం. ఆస్పత్రుల్లో దోపిడీపై నిఘా పెడతాం.

ప్రశ్న: ప్రభుత్వ బడుల్లో పిల్లలు జలుబు, జ్వరం, దగ్గుతో బాధపడుతున్నారు.
– అనురాధ, హెచ్ఎం, జిల్లెల్ల

సమాధానం: వాతావరణం చల్లబడడంతో జలుబు, దగ్గు, జ్వరాలు వస్తున్నాయి. ఈ లక్షణాలు ఎక్కువగా ఉంటే మూడు రోజులపాటు క్లావమ్–625(రెండు పూటలు), లివోసెట్రిజిన్, మోంటాలుక్కాస్(రోజుకు ఒకటి), ఫీవర్‌కు పారాసిటమాల్ వాడాలి. పీహెచ్‌సీల్లో డాక్టర్‌ను సంప్రదిస్తే కావాల్సిన యాంటిబయోటిక్స్, ఇతర మందులు రాసిస్తారు. ఆర్‌బీఎస్‌కే ద్వారా పాఠశాలల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: వారం రోజులుగా జ్వరం, దగ్గు తగ్గడం లేదు. ఆర్ఎంపీకి చూపించిన గొంతులో విపరీతమైన నొప్పిగా ఉండి ఆహారం తీసుకోవడానికి ఇబ్బందిగా ఉంది. ఏమి మందులు వాడాలి? పీఎం జనరిక్ ఔషధి దుకాణంలో ప్రభుత్వ జనరిక్ కాకుండా వేరేవి అమ్ముతున్నారు?
– యాటవారి రామకృష్ణ–గంభీరావుపేట, సాగర్–ఇల్లంతకుంట, ఎ.శంకర్–సిరిసిల్ల

సమాధానం: దగ్గరలోని పీహెచ్‌సీకి వెళ్లండి. ఆర్ఎంపీలను కాకుండా ఎంబీబీఎస్ వైద్యులతో చికిత్స అందిస్తున్న ప్రభుత్వ వైద్యం పొందితే త్వరగా కోలుకుంటారు. ఆర్ఎంపీ ఇచ్చిన మందులను కాకుండా అర్హత గల డాక్టర్‌కు చూపించుకోవాలి. అన్ని పీహెచ్‌సీల్లో జ్వరం, జలుబు, దగ్గు, నొప్పులు, యాంటిబయోటిక్స్ మందులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయి. ఉచితంగా దొరుకుతాయి. జన ఔషధిలో మందుల విషయంపై జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం.

ప్రశ్న: ప్రైవేటు ఆస్పత్రుల్లో అధిక ఫీజులు వసూలు చేయడంతోపాటు, ఆ వివరాలతో బోర్డులు పెట్టడం లేదు. వైరల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు చెప్పండి? పీహెచ్‌సీలో పిల్లలు, గైనకాలజిస్టు వైద్యులను ఉంచాలి?
– దోశల శంకర్, రాజవీరు–గంభీరావుపేట

సమాధానం: అన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో నిబంధనల ప్రకారం ఫీజులు, వివిధ రకాల టెస్టుల ధరలు, వైద్య సేవల ధరలతో బోర్డులు ఏర్పాటు చేయాలి. ఇందుకు అన్ని ఆస్పత్రుల్లో తనిఖీలు చేపడతాం. పీహెచ్‌సీల్లో స్పెషలిస్టుల ఏర్పాటు అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉంది. పైలట్ ప్రాజెక్టుగా యాదాద్రి జిల్లాలో ప్రవేశపెట్టారు. త్వరలోనే అన్ని జిల్లాలను విస్తరింపజేస్తారు.

ప్రశ్న: డెంగీని ఎలా నిర్ధారిస్తారు? టీ–హబ్‌లో థైరాయిడ్ టెస్టు చేయడం లేదు. వైరల్ ఫీవర్స్‌ను ఎలా గుర్తించాలి?
– నరేకుల కృష్ణ–వేములవాడ, రాజయ్య–గంభీరావుపేట

సమాధానం: అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో బీపీ, షుగర్, రక్త, మూత్ర పరీక్షలు, డెంగీ ర్యాపిడ్ టెస్టులు అందుబాటులో ఉన్నాయి. డెంగీని ఎన్ఎస్–1 ఎలిసా టెస్టు చేసి నిర్ధారిస్తారు. క్షేత్రస్థాయిలో ఏఎన్ఎం, ఆశవర్కర్లు అన్ని రకాల వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రత్యేక బృందాల ద్వారా సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తాం. టీ–హబ్‌లో టెక్నికల్ ప్రాబ్లం ఏర్పడింది. రెండు రోజుల్లోనే సమస్య పరిష్కారమవుతుంది.

క్లుప్తంగా

నేతకార్మికుడి ఆత్మహత్య

• సిరిసిల్లలో విషాదం


కొమురయ్య (ఫైల్)

సిరిసిల్లక్రైం: ఆర్థిక ఇబ్బందులు తాళలేక సిరిసిల్లలో మరో నేత కార్మికుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గణేశ్‌నగర్‌కు చెందిన ఎర్రం కొమురయ్య(55) కొన్నాళ్ల క్రితం చేనేత కార్మికుడిగా పనిచేసి పనులు లేక ప్రస్తుతం టైలరింగ్‌తో జీవనోపాధి పొందుతున్నాడు. జిల్లాలో వస్త్రపరిశ్రమలో ఏర్పడిన సంక్షోభంతో ఉపాధి దొరకడం లేదు. కొద్ది సంవత్సరాల క్రితం రూ.6లక్షలతో ఇంటిని నిర్మించగా మరో రూ.5లక్షలతో కూతురు వివాహం చేశాడు. ప్రస్తుతం పనులు లేకపోవడంతో అప్పులు తీర్చే మార్గం కనిపించలేదు. దీంతో మంగళవారం అర్ధరాత్రి ఇంట్లోనే ఉరివేసుకున్నాడు. మృతునికి భార్య కమల, ఇద్దరు కొడుకులు శ్రీకాంత్, సాయికిరణ్, కూతురు వరలక్ష్మి ఉండగా వీరందరికీ వివాహమైంది. ఇద్దరు కుమారులు పవర్‌లూమ్ కార్మికులుగా పనిచేస్తున్నారు. మృతుని భార్య కమల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. నాలుగు రోజుల క్రితం సిరిసిల్లకు చెందిన నేత వ్యాపారీ దంపతులు అమర్‌నాథ్–స్రవంతి ఆత్మహత్య కలకలం రేపగా.. తాజాగా మరో నేత కార్మికుడు మంగళవారం అర్ధరాత్రి బలవన్మరణానికి పాల్పడడం వస్త్రపరిశ్రమలో సంక్షోభాన్ని తెలియజేస్తుంది.

వైద్యం చేసిన డబ్బులు అడిగినందుకు దాడి

బోయినపల్లి(చొప్పదండి): తాను వైద్యం చేసిన డబ్బులు ఇమ్మని అడిగినందుకు మద్యం సీసాతో దాడి చేసిన ఘటన మండలంలోని వెంకట్రావుపల్లి వైన్స్ వద్ద చోటుచేసుకుంది. ఎస్సై పృథ్వీధర్ తెలిపిన వివరాలు. ఇల్లంతకుంట మండలానికి చెందిన తిరుపతి అనే వ్యక్తి తన మిత్రులతో కలిసి వెంకట్రావుపల్లి వైన్స్ వద్ద మద్యం సేవిస్తున్నాడు. అక్కడే మద్యం తాగుతున్న అశోక్‌ను వైద్యపరీక్షలు చేసిన డబ్బులు రూ.వేయి ఇవ్వాలని అడిగాడు. దీంతో అశోక్ అక్కడే ఉన్న ఖాళీ మద్యం సీసాతో తిరుపతి తలపై కొట్టాడు. దీంతో తిరుపతి తలకు గాయాలయ్యాయి. తిరుపతి ఫిర్యాదుతో అశోక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

అవుట్ సోర్సింగ్ సిబ్బందిని నియమిస్తాం

ముస్తాబాద్(సిరిసిల్ల): జిల్లాలోని వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ కార్యాలయాల్లో అవుట్ సోర్సింగ్ సిబ్బందితో విధులు నిర్వహిస్తామని జిల్లా మార్కెటింగ్ అధికారి డి.ప్రకాశ్ బుధవారం ప్రకటనలో తెలిపారు. 'సాక్షి'లో 'ఖాళీల వెక్కిరింపు' శీర్షికన బుధవారం ప్రచురితమైన కథనానికి జిల్లా మార్కెటింగ్ అధికారి స్పందించారు. జిల్లాలోని 10ఏఎంసీలకు 16 పోస్టులు మంజూరున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఐదుగురు మాత్రమే రెగ్యులర్ ఉద్యోగులు పనిచేస్తున్నారని, మిగతా ఉద్యోగులను ఔట్‌సోర్సింగ్ ద్వారా నియమించుకోనున్నట్లు తెలిపారు. ఏఎంసీల నుంచి నిధుల బదలాయింపు జరుగుతుందని, లింకు రోడ్లు ఇతర పనులకు ప్రస్తుతం నిధులు వెచ్చించడం లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం పశువైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఒకే అకౌంట్‌లో వందల కోట్లు మార్పిడి!

• స్టాక్‌మార్కెట్ పేరిట సైబర్ క్రైం
• రెండు నెలల క్రితం మెట్‌పల్లి వైద్యుడి ఫిర్యాదు
• పోలీసుల విచారణలో నివ్వెరపోయే నిజాలు
• అదుపులో పంజాబ్‌కు చెందిన ముగ్గురు నిందితులు





కోరుట్ల: ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా వందలాది కోట్ల మార్పిడి. మూడేళ్లలో ఓ వ్యక్తి ఖాతాలోకి మళ్లిన నగదు గురించి తెలిస్తే కళ్లు బైర్లు కమ్మాల్సిందే. స్టాక్ మార్కెట్ పేరిట ఓ ముఠా చేసిన సైబర్‌నేరం ఇది. మెట్‌పల్లికి చెందిన వైద్యుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు తీగ లాగితే డొంగ కదిలింది. రెండు నెలల క్రితం జగిత్యాల జిల్లాలోని మెట్‌పల్లికి చెందిన ఓ వైద్యుడిని స్టాక్‌మార్కెట్ యాప్ పేరిట ట్రాప్‌లోకి దించిన నిందితులు ఆయన ఖాతా నుంచి రూ.72లక్షలు కాజేశారు. తాను మోసపోయిన విషయం తెలుసుకున్న వైద్యుడు సైబర్‌క్రైం పోలీసులను ఆశ్రయించారు. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన జిల్లా పోలీస్ ఉన్నతధికారులు ఓ పోలీస్ బృందాన్ని ప్రత్యేకంగా ఏర్పాటుచేసి లోతైన విచారణ కోసం రంగంలోకి దించారు.

దుబాయి కేంద్రంగా..

మెట్‌పల్లి వైద్యుడి కేసును చాలెంజ్‌గా తీసుకున్న పోలీసులు విచారణ మొదలుపెట్టిన క్రమంలో స్టాక్ మార్కెట్ యాప్ పేరిట సైబర్ క్రైంకు పాల్పడిన నిందితులకు చెందిన బ్యాంక్ ఖాతాలను గుర్తించారు. ఈ నిందితులు పంజాబ్‌లోని జలంధర్‌లో ఉన్నట్లు గుర్తించి వారం క్రితం అక్కడికి వెళ్లి మకాం వేశారు. పక్క ప్రణాళికతో ముగ్గురిని పట్టుకున్నారు. ఒక్కొక్కరి ఖాతాలను పరిశీలించి స్టాక్‌మార్కెట్ పేరిట సాగుతున్న సైబర్‌క్రైం వివరాలు విచారించారు. ఈక్రమంలో ఒకరి అకౌంట్‌లో 2021 సంవత్సరం నుంచి దాదాపుగా రూ.50వేలు కోట్ల డబ్బుల మార్పిడి జరిగినట్లుగా గుర్తించి నివ్వెరపోయారు. ఈ ముగ్గురు నిందితులకు దుబాయిలోని ఓ ముఠా ద్వారా ట్రాన్‌జాక్షన్ చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

పోలీసుల అదుపులో నిందితులు..

మెట్‌పల్లి వైద్యుడిని స్టాక్‌మార్కెట్ యాప్ పేరిట సైబర్ ఉచ్చులోకి లాగిన ముగ్గురు నిందితులను జగిత్యాల జిల్లా ప్రత్యేక పోలీస్ బృందం అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వీరిని పూర్తిస్థాయిలో విచారించేందుకు జలంధర్ నుంచి జగిత్యాలకు తీసుకొచ్చినట్లు తెలిసింది. దుబాయి కేంద్రంగా సాగుతున్న సైబర్ ముఠా తీరుతెన్నులు. వారితో భాగస్వామ్యులుగా ఉన్న వ్యక్తుల వివరాలు, హవాలా మార్కెట్‌తో ఏమైనా సంబంధాలున్నాయా? అన్న దిశలో పోలీస్ విచారణ కొనసాగుతోంది.

ప్రసవాల సంఖ్య పెంచాలి


వైద్యశాఖ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ

• వైద్యుల ఖాళీల భర్తీకి చర్యలు
• కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ

సిరిసిల్లటౌన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ సూచించారు. కలెక్టరేట్‌లో వైద్యారోగ్య శాఖ అధికారులతో బుధవారం సమీక్షించారు. జిల్లాలో మే నుంచి అక్టోబర్ వరకు 3,206 ప్రసవాలు జరుగగా.. ప్రభుత్వాస్పత్రుల్లో 1,860, ప్రైవేటులో 1,308 జరిగాయన్నారు. గర్భిణీ తేదీ నుంచి ప్రసవం తేదీ వరకు మహిళ వివరాలు నమోదు చేయాలన్నారు. ఆశకార్యకర్తలు ఏఎన్ఎంలతో మహిళలకు టీకాలు అందేలా చూడాలన్నారు. జిల్లా వైద్య కళాశాల నుంచి ఇద్దరు గైనకాలజిస్టులను వేములవాడ ఏరియా ఆస్పత్రికి డిప్యూటేషన్‌పై నియమించి ప్రసవాల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ, డీఎంహెచ్‌వో వసంతరావు, మెడికల్ సూపరింటెండెంట్లు పెంచలయ్య, లక్ష్మీనారాయణ, ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.

పకడ్బందీగా గ్రూప్–3 నిర్వహించాలి

సమగ్ర ఇంటింటి సర్వే, గ్రూప్–3 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. హైదరాబాద్ నుంచి బుధవారం వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ, ఎస్పీ అఖిల్ మహాజన్, అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ పాల్గొన్నారు. స్ట్రాంగ్‌రూమ్ వద్ద ఏర్పాట్లు చేయాలన్నారు. టీపీపీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ పరీక్షలకు పటిష్టంగా బందోబస్తు చేపట్టాలని సూచించారు. సీపీవో శ్రీనివాసాచారి, డీఆర్డీవో శేషాద్రి, సివిల్ సప్లయ్ అధికారి వసంతలక్ష్మి, మేనేజర్ రజిత, డీసీవో రామకృష్ణ పాల్గొన్నారు.

16న స్కాలర్‌షిప్ నమోదుపై సదస్సు

సిరిసిల్లటౌన్: జిల్లాలోని అన్ని డిగ్రీ, పీజీ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో ఈనెల 16న ఎస్సీ విద్యార్థుల ఉపకార వేతనాల నమోదుపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎస్సీడీవో విజయలక్ష్మి ఒక ప్రకటలో తెలిపారు. కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాల్‌లో సాయంత్రం 4.30 గంటలకు కార్యక్రమం ఉంటుందన్నారు. కొత్తగా వచ్చిన ఆన్‌లైన్ ఆపాస్‌లో స్కాలర్‌షిప్ రిజిస్ట్రేషన్ నమోదుపై అవగాహన కల్పిస్తారని, అన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొనాలన్నారు.

కణతి తొలగించిన వైద్యులు



వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలోని అమృత నర్సింగ్ హోమ్‌లో బుధవారం ఓ మహిళ కడుపులో నుంచి భారీ కణతి తొలగించినట్లు వైద్యులు ఆనందరెడ్డి తెలిపారు. డాక్టర్ మాట్లాడుతూ చందుర్తి మండలం మల్యాల గ్రామానికి చెందిన మామిండ్ల లచ్చవ్వ తీవ్ర కడుపునొప్పితో ఆస్పత్రికి రాగా.. వైద్యపరీక్షలు చేసి కణతి ఉన్నట్లు గుర్తించామన్నారు. వెంటనే శస్త్రచికిత్స చేసి 8 కిలోల కణతి తొలగించినట్లు పేర్కొన్నారు. వైద్యులు సుమన్‌మోహన్‌రావు, పెంచలయ్య ఆధ్వర్యంలో ఆపరేషన్ చేసినట్లు తెలిపారు.

చురుకుగా సర్వే చేపట్టాలి

బోయినపల్లి(చొప్పదండి): ప్రభుత్వం చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను సిబ్బంది చురుకుగా చేపట్టాలని జెడ్పీ సీఈవో వినోద్ సూచించారు. మండలంలోని తడగొండ, కోరెం గ్రామాల్లోని సర్వేను బుధవారం పరిశీలించి మాట్లాడారు. ఎన్యుమరేటర్స్ తమకు కేటాయించిన బ్లాక్‌ల్లో సర్వే పారదర్శకంగా చేపట్టాలన్నారు. ఎంపీడీవో భీమ జయశీల మండలంలోని ఇతర గ్రామాల్లోని సర్వేను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు సుమలత, రాజశేఖర్, శ్రీనివాస్ ఉన్నారు.

రైల్వే నిర్వాసితులను పట్టించుకోవడం లేదు

• కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య


మాట్లాడుతున్న రైల్వే భూ నిర్వాసితులు

వేములవాడఅర్బన్: వేములవాడలోని రైల్వే భూనిర్వాసితులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పేర్కొన్నారు. వేములవాడలోని మున్నూరుకాపు నిత్యాన్నదాన సత్రంలో బుధవారం రైల్వే భూనిర్వాసితులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వేములవాడకు రైల్వేలైన్ పేరుతో భూములను గెజిట్ నోటిఫికేషన్ ద్వారా క్రయవిక్రయాలు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 120 మంది నుంచి భూసేకరణ చేయాల్సి ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి రైల్వే లైన్ నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు. నిర్వాసితులు శంకర్, నర్సయ్య, శేఖర్, ఎల్లయ్య, పద్మ, రేణుక, సుజాత పాల్గొన్నారు.

చేపపిల్లలతో ఉపాధి పొందాలి



గంభీరావుపేట(సిరిసిల్ల)/బోయినపల్లి(చొప్పదండి): మత్స్యకారులు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న చేపపిల్లలతో ఉపాధి పొందాలని జిల్లా మత్స్యశాఖ అధికారి సౌజన్య కోరారు. మండలంలోని గంభీరావుపేట, ముస్తఫానగర్, లింగన్నపేటల్లోని 14 చెరువుల్లో సుమారు 1.37లక్షల చేపపిల్లలను బుధవారం పంపిణీ చేశారు. నాయకులు కరువారి శంకర్, రాజుగౌడ్, అక్కపల్లి బాలయ్య, రాజనర్సు, కుమార్, గౌరీశంకర్ పాల్గొన్నారు.

నేడు మిడ్‌మానేరులో విడుదల

మిడ్‌మానేరులో గురువారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో చేపపిల్లలు విడుదల చేస్తారని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి తెలిపారు.



మినీస్టేడియం సందర్శన

సిరిసిల్ల ఎడ్యుకేషన్: పట్టణంలోని మినీస్టేడియాన్ని రిలయన్స్ ఫౌండేషన్ సభ్యులు ప్రవీణ్‌కుమార్, ఆపరేషనల్ డైరెక్టర్ సాగర్‌పటేల్, ఆపరేషనల్ అథ్లెటిక్స్ మేనేజర్, రాంధరయాదవ్, హెడ్ టాలెంట్ స్కాట్ ఎల్బీ స్టేడియం అడ్మినిస్ట్రేటర్ రవికుమార్ సందర్శించారు. వీరికి జిల్లా క్రీడాశాఖ అధికారి అజ్మీరా రాందాస్, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు చెన్నమనేని శ్రీకుమార్ స్వాగతం పలికారు. జిల్లాలోని క్రీడా సదుపాయాలు అవసరమైన అభివృద్ధి పనులపై వివరించారు. వాలీబాల్ అకాడమీ కోచ్‌లు గుర్రం సంపత్, జగన్‌మోహన్, కబడ్డీ కోచ్ ప్రశాంత్, ఆర్చరీ కోచ్ హరీశ్ తదితరులు పాల్గొన్నారు.





అలరించిన నాటక ప్రదర్శనలు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలోని వ్యవసాయ కళాశాలలో బుధవారం రెండో రోజు విద్యార్థుల నాటక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మూడు రోజులపాటు నిర్వహించే ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ యూనివర్సిటీ అనుబంధ కళాశాలల కల్చరల్ అండ్ లిటరరీ మీట్‌లో భాగంగా విద్యార్థులు వేషధారణలు ఆకట్టుకున్నాయి. స్థానిక బాబు జగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జి.శ్రీదేవి మాట్లాడుతూ తెలుగు, ఇంగ్లిష్ డిబేట్, క్విజ్, నాటకాలలో మోనోయాక్టింగ్, వన్ అర్ట్ ప్లే, సోలో ఫోక్‌సాంగ్, గ్రూప్ ఫోక్‌సాంగ్, క్రియేటివ్ అర్ట్స్, పోస్టర్ మేకింగ్, కార్టూనింగ్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు.





పెళ్లికి హాజరై వెళ్తూ.. అనంతలోకాలకు

• కారు ప్రమాదంలో భార్య మృతి, భర్త, కూతురికి గాయాలు
• హైదరాబాద్‌లో ఘటన


రోషిణి (ఫైల్)


నుజ్జునుజ్జయిన కారు ముందు భాగం

వేములవాడరూరల్: కూతురితో కలిసి బంధువుల పెళ్లికి హాజరయ్యారు.. అందరితో సంతోషంగా గడిపి, తిరిగి వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యారు.. ఈ ఘటనలో భార్య మృతిచెందగా భర్త, కూతురికి స్వల్ప గాయాలయ్యాయి. బాధిత కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. వేములవాడరూరల్ మండలంలోని లింగంపల్లికి చెందిన కొలిపాక సుమన్ హైదరాబాద్‌లోని ఓ బ్యాంకులో పని చేస్తున్నాడు. భార్య రోషిణి(24), కూతురితో కలిసి అక్కడే ఉంటున్నాడు. ముగ్గురూ వేములవాడలో జరిగిన బంధువుల వివాహానికి కారులో వచ్చారు. బుధవారం ఉదయం తిరిగి హైదరాబాద్ వెళ్లారు. రింగ్ రోడ్డుపై కారు అదుపుతప్పి, ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రోషిణి తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆమె భర్త సుమన్, కూతురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గాంధీ ఆస్పత్రిలో పంచనామా అనంతరం రోషిణి మృతదేహాన్ని బంధువులు స్వగ్రామం లింగంపల్లికి తీసుకొచ్చారు.

డ్రగ్స్‌తో జీవితం నాశనం చేసుకోవద్దు

• యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఇన్‌చార్జి ఉపేందర్


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఉపేందర్, అధికారులు

సిరిసిల్లటౌన్: గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడి యువత జీవితాలను నాశనం చేసుకోవద్దని యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఇన్‌చార్జి సామల ఉపేందర్ కోరారు. సిరిసిల్లలోని వికాస్ డిగ్రీ కళాశాలలో బుధవారం మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే భవిష్యత్‌లో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలకు అర్హత సాధించలేరన్నారు. విద్యార్థులు చదువుపైనే శ్రద్ధ పెట్టి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. మత్తు పదార్థాల వినియోగం, సరఫరా గురించి తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ, ఎస్సై కృష్ణమూర్తి, కళాశాల కరెస్పాండెంట్ గుగ్గిళ్ల జగన్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆకతాయిలు వేధిస్తే సమాచారం ఇవ్వాలి



బోయినపల్లి: మహిళలను ఆకతాయిలు వేధిస్తే షీటీమ్‌కు సమాచారం అందించాలని వేములవాడరూరల్ సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. సైబర్ నేరాలు,100 డయల్, దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు తదితర అంశాలపై మండలంలోని కోరెం గ్రామ ప్రజలతో బుధవారం రాత్రి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎలాంటి సంఘటనలు జరిగినా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై దూలం పృథ్వీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు పెంపెందించాలి

• డీఈవో రమేశ్‌కుమార్


తనిఖీ చేస్తున్న డీఈవో రమేశ్‌కుమార్

సిరిసిల్ల ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలని జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ సూచించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని సర్దాపూర్ మండల పరిషత్ పాఠశాలను బుధవారం తనిఖీ చేశారు. మధ్యాహ్నం భోజనం, వంటగదిని పరిశీలించారు. చదవడం, రాయడం, లెక్కలు చేయడం వంటి సామర్థ్యాలు రావాలని సూచించారు. హెచ్‌ఎం స్వాతి, ఉపాధ్యాయులు ఉన్నారు.

కార్మికులకు అండగా కాంగ్రెస్ సర్కారు


• కేటీఆర్ నిర్లక్ష్యంతోనే వస్త్రపరిశ్రమలో సంక్షోభం
• కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్


మాట్లాడుతున్న చొప్పదండి ప్రకాశ్

సిరిసిల్లటౌన్: నేతన్నలకు కాంగ్రెస్ ప్రభుత్వమే అండగా ఉంటోందని ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్ పేర్కొన్నారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వంలో పదేళ్లుగా మంత్రిగా ఉన్న కేటీఆర్ నిర్లక్ష్యంతోనే వస్త్రపరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయిందని ఆరోపించారు. బతుకమ్మ చీరలతో ఆయన అనుయాయులే లబ్ధి పొందారన్నారు. పరిశ్రమ, కార్మికుల మనుగడ కోసమే తమ ప్రభుత్వం నూలు డిపోను ఏర్పాటు చేసిందని తెలిపారు. బీఆర్ఎస్ నేతలు ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం, కేకే మహేందర్‌రెడ్డిపై చేస్తున్న తప్పుడు ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, నాయకులు గోనె ఎల్లప్ప, యెల్లె లక్ష్మీనారాయణ, మ్యాన ప్రసాద్, కత్తెర దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పనిభారం తగ్గించాలి

• జిల్లా ఆస్పత్రి ఎదుట కార్మికుల ధర్నా


ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న శానిటేషన్ కార్మికులు

సిరిసిల్లటౌన్: జిల్లా ఆస్పత్రిలో పనిచేసే శానిటేషన్, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ గార్డులకు పనిభారం తగ్గించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ కోరారు. ఈమేరకు కార్మికులు బుధవారం ఆస్పత్రి ఎదుట ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ కార్మికులకు రావాల్సిన పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరారు. అన్నల్‌దాస్ గణేశ్, పద్మ, నాగమణి, దేవలక్ష్మి, తిరుపతి, దేవరాజు, లలిత, రేణ, మమత, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక కార్తీక దీపోత్సవం



వేములవాడ అర్బన్: వేములవాడ రాజన్న ఆలయంలో సామూహిక కార్తీక దీపోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కళావేదిక ప్రాంగణంలో రాజన్న ఆలయ భజన బృందంచే సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.

రాజన్న ఆలయంతో తులసీ కల్యాణం

వేములవాడ రాజన్న ఆలయంలో బుధవారం కార్తీక శుద్ధ ద్వాదశి సందర్భంగా ఉదయం శ్రీ రుక్మిణీ విఠలేశ్వరస్వామివారికి అర్చకులు అభిషేకం నిర్వహించారు. సాయంత్రం శ్రీ తులసీ కల్యాణం వైభవంగా జరిపారు.



కమనీయం.. కల్యాణం


కల్యాణం తిలకిస్తున్న భక్తులు



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శ్రీరుక్మిణి వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం బుధవారం కనుల పండువగా సాగింది. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మాజీ సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి, అశ్విని హాస్పిటల్స్ అధినేత డాక్టర్ సత్యనారాయణస్వామి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. శ్రీవేణుగోపాలస్వామి కల్యాణోత్సవాన్ని పురస్కరించుకొని దోస్త్ యూత్ సభ్యుడు ఈసరి కిరణ్ 350 లడ్డూ ప్రసాదాలు అందించారు.